చెత్త..ఇలా వేస్తే ఎలా..?

- ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పేరుకుపోతున్న చెత్తాచెదారం
- చెత్తను తీయడానికి బయపడుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- ఎన్నిసార్లు అవగాహన కల్పించినా కొంత మందిలో రాని మార్పు


ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తాచెదారం


గణేష్ నగర్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ఆటోలలో కాకుండా కొంత మంది ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద చెత్తను వేస్తూ కరెంటు సిబ్బందికి ఇబ్బంది కలిగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తను తీయడానికి బయపడుతున్నారు. ప్రజలకు చెత్తపై అనేకమార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంత మందిలో మార్పు రావడం లేదు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీ, కాటేదాన్, గణేష్‌నగర్, ఆప్కో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తను వేయొద్దని ఏరియా లైన్‌మెన్ ప్రజలను కోరినా వారు పెడచెవినపెడుతున్నారు.


మధుబన్ కాలనీలో..

జరిమానా విధించినా..

ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చెత్త వేయడం వల్ల అక్కడికి వచ్చిన పశువులు ఇతర జంతువులు విద్యుదాఘాతానికి బలయ్యే ప్రమాదం ఉంది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూడా ప్రజలకు అనేక మార్లు చెత్త వేయడంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి చెత్త వేసే ప్రదేశాల్లో ముగ్గులు వేసిన సందర్భాలు అనేక ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలలో చైతన్యం రావడంలేదు. రోడ్లపై చెత్తవేసే వారికి జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఉదయం నుంచి ఆ ప్రదేశాలలో ఉండి చెత్తను వేసే వారికి జరిమానాను విధించిన ఎలాంటి ప్రయోజనం కలుగడంలేదు. కరెంటు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలలో చెత్తాచెదారంతో పాటు, పిచ్చి మొక్కలు, గడ్డి లేకుండా జీహెచ్‌ఎంసీ వారు శుభ్రం చేయాలని కరెంటు సిబ్బంది కోరుకుంటున్నారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల చుట్టూ సిమెంటుతో ఫ్లోరింగ్ చేయిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి..



కాలనీలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. అవగాహన లేని ప్రజలు అక్కడ చెత్తను వేయకుండా ఉంటారు. మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు రాకుండా ఉంటాయి. అప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరగవు. మరమ్మతులు చేయడానికి సులువుగా ఉంటుంది.

– మునగపాటి వెంకటేష్, పద్మశాలిపురం

సిమెంటుతో ఫ్లోరింగ్ చేయాలి..



ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ చెత్తను వేయకుండా అన్ని చోట్ల సిమెంటుతో ఫ్లోరింగ్ చేయాలి. అప్పుడే ప్రజలు అక్కడ చెత్తను వేయకుండా ఉంటారు. కరెంటు సిబ్బందికి కూడా కరెంటు సమస్య తలెత్తినప్పుడు మరమ్మతులు చేయడానికి ఇబ్బంది కలుగకుండా ఉంటుంది.

– సంపంగి నర్సింహ, మధుబన్ కాలనీ

మరమ్మతులు చేయడానికి ఇబ్బందిగా ఉంటుంది..

ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ చెత్త వేయడంతో విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు మరమ్మతులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చెత్తను వేయొద్దని అనేకమార్లు కాలనీలో ఉన్న ప్రజలకు చెప్పినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. జీహెచ్‌ఎంసీ వారు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తను వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలి – యాదయ్య, లైన్‌మెన్

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని స్వాగత్ డిలైట్ అపార్ట్‌మెంట్‌లో శ్రీనివాస కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదపడింతులు, పరాశర శ్రీరామ బట్టర్, సముద్రాల శిఖామణి, సముద్రాల శ్రీమన్నారాయణలు ఈ వేడుకని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పరాశర శ్రీరామ భట్టాచార్య–శ్రీదేవి, ములుగు సుధాకర్ శర్మ–రాధాకుమారి, రాజేంద్రప్రసాద్–స్వాతి, భరత్ కుమార్–స్నేహ, లోకేశ్వర్ రెడ్డి–శారద దేవి, అఖిల్–శ్రావ్య, చైతన్య–ఇంద్ర ప్రియదర్శిని దంపతులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు.

రోడ్డుపై చెత్త వేసిన వ్యక్తికి జరిమానా

శంషాబాద్: రోడ్డు చెత్త పారబోసిన వ్యక్తికి శంషాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం అధికారులు జరిమానా విధించారు. పట్టణంలోని జాతీయ రహదారితో పాటు ఆయా రహదారులలో మంగళవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి ఓ వ్యక్తి వాహనంలో చెత్తను తీసుకొచ్చి పడేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అతడిని మున్సిపాలిటీ కార్యాలయానికి రప్పించి రూ.వేయి జరిమానా విధించినట్లు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ అనిల్ తెలిపారు. రోడ్లపై చెత్త వేసిన వారికి ఇకపై జరిమానాలుంటాయని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



శాస్త్రిపురం: శాస్త్రిపురం డివిజన్ శివరాంపల్లి రిజ్వాన్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా రిజ్వాన్ కాలనీవాసులు సీసీ రోడ్డు లేక మట్టి రోడ్డుతో ఇబ్బందిపడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగి సీసీ రోడ్డును మంజూరు చేసుకున్నామని సోమవారం రాత్రి సీసీ రోడ్డు పనులు ప్రారంభం మయ్యాయని స్థానికులు తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం

మణికొండ: వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ భూలక్ష్మమ్మ ఆలయ అభివృద్ధికి వారి క్లబ్ తరపున రూ.30 వేల చెక్కును, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఆటిజం పిల్లలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ తరపున ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి శిరీష, ఉపాధ్యాయులు, ఆలయ అర్చకుడు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలి

గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–3లో గత వారం రోజులుగా కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీటిలో అర గంట పాటు కలుషిత నీరు సరఫరా కావడంతో తాగడానికి నీరందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు కలుషిత నీటి కారణంగా అనారోగ్యానికి గురి కాకముందే తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు. అధికారులు స్పందించి కలుషిత తాగునీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మణికొండ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ ఎస్పీ సీతారామ్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులపై వారి తల్లిదండ్రులు, బంధు మిత్రులతో పాటు సమాజం ఎన్నో ఆశలు పెట్టుకుందని, వాటిని సాధించి ఉత్తమ పౌరులుగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వాడితే ఆరోగ్యం పాడవడంతో పాటు భవిష్యత్తు జీవితం అంధకారంగా మారుతుందన్నారు. డ్రగ్స్ వాడే వారితో పాటు అమ్మే వారి పట్ల ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్టికీ నోట్స్ క్యాంపెయిన్‌లో భాగంగా మత్తు వ్యతిరేక నినాదాలు, ప్రతిజ్ఞలు, స్ఫూర్తిదాయక సందేశాలు రాసిన రంగు రంగుల స్టికీ నోట్స్ అన్నీ కలిపి వాల్ ఆఫ్ అవేర్‌నెస్ రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కో డీఎస్పీ సైదులు, ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఇంపాక్ట్ గ్రూప్ ప్రతినిధి సతీష్, యాంటీ డ్రగ్ కమిటీ కో ఆర్డినేటర్ రామ్‌చందర్, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో అధికారులు, ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'బస్తీబాట'


బస్తీబాట కార్యక్రమంలో విద్యుత్ అధికారులు

రాజేంద్రనగర్: క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ (ఎస్ఈ) డీఎస్ మోహన్ వెల్లడించారు. మంగళవారం విద్యుత్ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ బుద్వేల్‌లో బస్తీబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూపరింటెండెంట్ ఇంజినీర్ డీఎస్ మోహన్, రాజేంద్రనగర్ సెక్షన్‌లో డివిజనల్ ఇంజినీర్ పి.రత్నాకర్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ జి.సత్యనారాయణ, సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.దుర్గా ప్రసాద్‌తో కలిసి బుద్వేల్‌లోని సాయికృష్ణ కాలనీలో పర్యటించి విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు తెలిపిన సమస్యలను అప్పటికప్పుడే సిబ్బంది చేత సరి చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీరామ్ మోహన్, డీఈ రత్నాకర్ రావు మాట్లాడుతూ..విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ సంస్థ ముఖ్య ధ్యేయమన్నారు. విద్యుత్ ఇంజినీర్లు, సిబ్బంది అన్ని వేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

వరద ముప్పును తప్పిస్తాం: మున్సిపల్ కమిషనర్


హుడా కాలనీ ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్, డీఈ

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని కాలనీలలో భారీ వర్షం కురిసినపుడు వరద గృహాలు, అపార్ట్‌మెంట్‌లలోకి వచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని, వాటిని నివారించేందుకు కార్యాచరణతో అదనపు డ్రైనేజీ నిర్మాణాలు చేపడతామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన హుడా కాలనీ నుంచి భాగ్యలక్ష్మి కాలనీకి వెళ్లే దారిలో ఇటీవల వరద నీరు గృహాల్లోకి చేరి ఇబ్బంది కలిగించిన విషయాన్ని తెలుసుకుని మంగళవారం ఇంజినీరింగ్ డీఈ సంజయ్‌తో కలిసి పరిశీలించారు. వరద ముప్పు లేకుండా సమస్యను పరిష్కరించాలని డీఈకి సూచించారు. ఇదే తరహాల్లో శ్రీరాంనగర్ గోల్డెన్ టెంపుల్ వద్ద ఇటీవల వర్షాలకు రోడ్డు పాడైపోయి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుండటంతో దాన్ని పరిశీలించి మరమ్మతు పనులను ప్రారంభింపచేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

బండ్లగూడ: ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య పనులను కమిషన్ శరత్‌చంద్ర పరిశీలించారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లోని దర్గా ఖాలీజ్ ఖాన్, 20వ డివిజన్‌లోని కాళీమందర్ జంక్షన్, 15వ డివిజన్‌లోని సన్‌సిటీ ప్రధాన రహదారులపై ఉదయం 6 గంటలకు సిబ్బంది చేస్తున్న పనులను పరిశీలించారు. రహదారులపై స్వీపింగ్ చేస్తున్న సమయంలో వేగంగా వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎక్కడ కూడా చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట శానిటరీ జవాన్లు, మీర్జా టౌఫిక్, నరేందర్, రాములు, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శంషాబాద్ రూరల్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాల్‌లో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, గొప్ప సేవగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాంరెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ వార్డుకు చెందిన కొమ్ము సుగుణమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.60వేలు మంజూరు కావడంతో మంగళవారం ఆయన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. తలారి మల్లేష్‌ముదిరాజ్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ, గ్రామస్థులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరం..

రాజేంద్రనగర్: సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాజేంద్రనగర్ మండలానికి చెందిన 276 మంది లబ్ధిదారులకు రెండు కోట్ల 77 లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఇందులో కల్యాణలక్ష్మి 92, షాదీముబారక్ 184 మందికి లబ్ధిదారులు ఉన్నారన్నారు. నియోజకవర్గం పరిధిలోని గండిపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాలలో వేలాది మందికి ఈ పథకాన్ని అందజేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, వర్రీ లలిత నంద, రగడంపల్లి శ్రావణ్, శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ శీను పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరప్రతాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవార్లు 11 అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు శ్రీచక్రార్చన, విశేష పూజా కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటల నుంచి సామూహిక లలితా సహస్ర నామ పూర్వక కుంకుమార్చనలు ఉంటాయన్నారు. మహాలక్ష్మీ దేవి పూజ, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. సరస్వతీ పూజ విద్యార్థులకు అక్షరాభ్యాసం, శ్రీదుర్గా హోమం ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.



మహోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభుసాగర్

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్‌గా ఎం.ప్రభుసాగర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా..డైరక్టర్లు, రైతుల సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు. పాలకవర్గం పదవీ కాలం పూర్తయిన తర్వాత ఫిబ్రవరిలో మొదటి సారి పదవీ కాలాన్ని పొడగించారు. ఆగస్టులో రెండోసారి పొడగింపులో భాగంగా చైర్మన్ బి.సతీష్‌ను పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో ప్రభుసాగర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సొసైటీ, రైతుల అభ్యున్నతికి కలిసి కట్టుగా ముందుకు సాగుతామనిన తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: పని చేసే వారికి ప్రజల్లో తప్పక గుర్తింపు ఉంటుందని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బుద్వేల్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆదేశం మేరకు మంగళవారం సీసీ రోడ్డు పనులను పరిశీలించినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, సాయి ముదిరాజ్, భరత్ రెడ్డితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.